రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు జిల్లా విద్యార్థిని

శీక్షిక

కంఠేశ్వర్, నవంబర్ 4 : గూపన్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఏడోతరగతి విద్యార్థిని శీక్షిక మహబూబాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శకుంతలాదేవి తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ సిబ్బంది, తోటి విద్యార్థులు శీక్షికను సోమవారం అభినందించారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు పడకల్ విద్యార్థి

కైలాస్‌నాయక్

జక్రాన్‌పల్లి, నవంబర్ 4 : జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 వాలీబాల్ పోటీలకు మండలంలోని పడకల్ తండాకు చెందిన బాదావత్ కైలాస్‌నాయక్ ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో నిర్వహించే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కైలాస్ నాయక్‌ను హెచ్ఎం సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కార్యదర్శి మల్లేశ్‌గౌడ్, వీడీసీ సభ్యులు తండావాసులు అభినందించారు.

విద్యార్థులకు అభినందన

సారంగాపూర్, నవంబర్ 4 : వరంగల్‌లో ఇటీవల నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 జూడో పోటీల్లో గుండారం జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థినులు ప్రతిభ చూపి, బహుమతులు సాధించారు. పదోతరగతి విద్యార్థిని అంజలి, గాయత్రి రజత పతకాలు సాధించారు. విద్యార్థులతోపాటు పీడీ అనితను పాఠశాలలో హెచ్ఎం బి.అమర్‌నాథ్ ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

జిల్లాస్థాయి కవితా పోటీలు

సుభాష్‌నగర్, నవంబర్ 4 : ఇందూరు జిల్లా బాల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని 'నేను నా బాల్యం' అంశంపై జిల్లాస్థాయి వచన కవితా, రచన పోటీలను నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షుడు కాసర్ల నరేశ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవిత 20 వరుసలకు మించకుండా ఉండాలని, నేటి (మంగళవారం) సాయంత్రంలోగా 94414062552 నంబర్‌కు వాట్సాప్ పంపాలని సూచించారు. విజేతలకు బాలల దినోత్సవం రోజున సన్మాన పత్రం, బహుమతి ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష

ఖలీల్‌వాడి, నవంబర్ 4 : నిజామాబాద్ డివిజన్ పరిధిలో ఆయుష్మాన్ ఆరోగ్య సెంటర్లలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలతో డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ సోమవారం సమావేశం ఏర్పాటుచేసి, పలు సూచనలు చేశారు. మాతా శిశు సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, కీటక జనిత, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ఆరోగ్య సేవలపై సమీక్షించారు. సమావేశంలో నిజామాబాద్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజన్న, కీటకజనిత వ్యాధుల నియంత్రణాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర పోగ్రాం అధికారి డాక్టర్ రాజుగౌడ్, అసంక్రమిత వ్యాధుల నియంత్రణాధికారి డాక్టర్ వినీతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

వినాయక్‌నగర్, నవంబర్ 4 : నగరంలోని పూసాలగల్లీ ప్రాంతంలోని ఓ భవనం వద్ద సోమవారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించిన స్థానికులు.. వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందిచగా.. ఘటనాస్థలానికి చేరుకొని మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి సంబంధించిన ఆధారాలు లభించలేవని, సుమారు 50 ఏండ్లు ఉంటాయని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించామని, మృతుడి సంబంధీకులు 87126 59837 నంబర్‌కు ఫోన్‌చేయాలని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సూచించారు.

'ప్రజావాణి'కి 64 ఫిర్యాదులు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

కంఠేశ్వర్, నవంబర్ 4 : జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 64 ఫిర్యాదులు వచ్చినట్లు ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను ట్రైనీ కలెక్టర్‌తో పాటు మెప్మా పీడీ రాజేందర్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్, నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం..

డీఎస్సీ నియామకాల్లో పెండింగ్‌లో పెట్టిన పోస్టులను త్వరగా పూర్తి చేయాలని ఉత్తీర్ణులైన అభ్యర్థులు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. గతనెలలో విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో 1:3 నిష్పత్తిలో వివిధ పోస్టులకు ఎంపికయ్యామని, ధ్రువపత్రాల పరిశీలనలో అన్ని పత్రాలు సమర్పించినా, వివిధ కారణాలతో పోస్టులను పెండింగ్‌లో పెట్టారని వాపోయారు. ఈ విషయమై డీఈవోను పలుమార్లు సంప్రదించినా హైదరాబాద్‌కు ఎలిజబుల్ లిస్ట్ పంపామని చెబుతూ కాలం వెల్లదీస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని డీఎస్సీ కార్యాలయంలో సంప్రదిస్తే జిల్లా డీఎస్సీ కమిటీని సంప్రదించాలని సూచిస్తున్నారని, 20 రోజుల నుంచి డీఈవో కార్యాలయం చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదని, తమ కలెక్టర్ తమ సమస్యకు పరిష్కరించాలని కోరారు.

ఇండ్ల పట్టాలు అందజేయాలని వినతి..

నగరంలోని 4వ డివిజన్ మాధవ్‌నగర్ కెనాల్‌కట్టపై 80 గుడిసెలు వేసుకొని 25 ఏండ్లుగా నివాసముంటున్న తమకు ఇండ్లపట్టాలు అందజేయాలని పలువురు కోరారు. తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

నగర సమస్యలపై సీపీఎం నాయకులు..

కంఠేశ్వర్, నవంబర్ 4 : నగరంలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. నగర కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. కొన్ని వార్డుల్లో కుక్కలు, దోమల బెడదను అరికట్టాలని, తాగునీటి సమస్య, నాగారంలోని 80 క్వార్టర్స్, ఆర్‌జీకే, 300 క్వార్టర్స్‌లో డంపింగ్‌యార్డు సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

సిర్నాపల్లిలో సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

ధర్పల్లి/ ఇందల్వాయి/ సిరికొండ, నవంబర్ 4 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ధర్పల్లి మండలంలోని సీతాయిపేట్, హోన్నాజీపేట్, ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి, సిరికొండ మండలకేంద్రం తోపాటు గడ్కోల్, కొండూర్, పెద్దవాల్గోట్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం తనిఖీ చేశారు. తేమ శాతం 14, తక్కువ ఉన్న ధ్యాన్యాన్ని కొనుగోలు చేసి, రైస్‌మిల్లులకు పంపాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట డీఆర్డీవో సాయాగౌడ్, ధర్పల్లి ఎంపీడీవో బాలకృష్ణ, ఏపీవో సునీత, సిరికొండ తహసీల్దార్ రవీందర్‌రావు, ఆర్ఐ గంగరాజం పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి, నవంబర్ 4 : డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లిలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సోమవారం అందజేశారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలో డిచ్‌పల్లి, ధర్పల్లి, ఇందల్వాయి, సిరికొండ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన 203 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం జక్రాన్‌పల్లి మండలకేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 248 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. త్వరలో చేపట్టే కులగణన సర్వేకు వచ్చే అధికారులకు పూర్తి వివరాలు అందజేసి సహకరించాలని కోరారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

కోటగిరి (పొతంగల్)/ రుద్రూర్, నవంబర్ 4 : కోటగిరి, రుద్రూర్‌లోని కస్తూర్బా పాఠశాలలను జీఈసీవో భాగ్యలక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఎలా చదువుతున్నారని ఆరా తీశారు. ఆమె వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలి

- **రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి**

కంఠేశ్వర్, నవంబర్ 4 : యాసంగి సీజన్‌లో నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు అన్నివర్గాలవారు సహకరించాలని సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి కోరారు. కలెక్టరేట్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా విత్తనాభివృద్ధి సంస్థ, వ్యవసాయశాఖ అధికారులు, సహకార సంఘాల చైర్మన్లు, సీఈవోలతో సమన్వయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. 2024-25 యాసంగి సీజన్‌లో వివిధ పంటల సాగుకు అవసరమైన విత్తనాలను సరఫరా చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించి, సలహాలు, సూచనలు స్వీకరించి, మాట్లాడారు. జిల్లాలో యాసంగి సీజన్‌లో సుమారు 5.5 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగుచేస్తారని, లక్షా 20 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేశారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

ధర్పల్లి/ సారంగపూర్/ సిరికొండ, నవంబర్ 4 : ఈనెల 6వ తేదీ నుంచి చేపట్టనున్న సామాజిక, ఆర్థిక కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ధర్పల్లి ఎంపీడీవోలు బాలకృష్ణ, రూరల్ తహసీల్దార్ అనిరుధ్ సర్వే సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు సూచించారు. ఎన్యుమరేటర్లుగా వ్యవహరించనున్న ఎస్‌జీటీ టీచర్లు, సూపర్‌వైజర్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాల్లో రూరల్ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎంఈవో సేవ్లా, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ దీపిక, మాస్టర్ ట్రైనర్లు సతీశ్, ప్రసన్న, అశోక్, గంగాధర్, ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి, సిరికొండ ఎంపీడీవో మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన సదస్సు

డిచ్‌పల్లి, నవంబర్ 4 : మండలంలోని మెంట్రాజ్‌పల్లిలో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులపై సోమవవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్యవివాహాలు, అక్రమంగా దత్తత తీసుకోకుంటే తీసుకునే చర్యలు, బేటీ బచావో- బేటీపడావో, బాలల హక్కులు తదితర అంశాలపై చైల్డ్ హెల్ప్‌లైన్ కో-ఆర్డినేటర్ జ్యోత్స్నాదేవి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీక్ సింగ్, అంగన్‌వాడీ టీచర్లు సునీత, శమంత పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులతో సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ దిలీప్‌కుమార్

కంఠేశ్వర్, నవంబర్ 4 : నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి సమావేశం నిర్వహించిన కమిషనర్.. పట్టణ స్థితిగతులపై ఆరా తీశారు. నగరంలో పన్నుల వసూలు మెరుగుదల కోసం ఆర్ఐలు, బీసీలకు సూచనలు చేశారు.

టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడిగా సుమన్

ఖలీల్‌వాడి/ కంఠేశ్వర్, నవంబర్ 4 : టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడిగా సుమన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా పెద్దోళ్ల నాగరాజును రాష్ట్ర కమిటీ నియామకం చేసింది. పదేండ్ల పాటు బాధ్యతలు చేపట్టిన అలుక కిషన్ గెజిటెడ్ అధికారిగా ఉండడంతో పదవి నుంచి తప్పుకున్నారు. ఆ పదవి ఖాళీగా ఉండడంతో వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న సుమన్‌ను నియమించింది. వారిని టీఎన్జీవోస్ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు.

ట్రాన్స్‌కో ఎంప్లాయిస్ యూనియన్ - 1104 కార్యవర్గం ఎన్నిక

కంఠేశ్వర్, నవంబర్ 4 : ట్రాన్స్‌కో ఎంప్లాయిస్ -1104 యూనియన్ కార్యవర్గాన్ని ట్రాన్స్‌కో అధ్యక్షుడు తులసీరాం, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్మిక భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రీజినల్ ప్రెసిడెంట్‌గా రాజేంద్రప్రసాద్, రీజినల్ సెక్రటరీగా గోపీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భానుప్రకాశ్, అడిషనల్ సెక్రటరీలుగా కృష్ణప్రసాద్, గౌతమి, వైస్‌ప్రెసిడెంట్లుగా రాజు, స్వప్న, మహిపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీధర్‌రెడ్డి, ట్రెజరర్‌గా నర్సింహులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, అదనపు కార్యదర్శి రామచంద్రం, ఎన్‌పీడీసీఎల్ డిస్కం ప్రెసిడెంట్ రఘునందన్ పాల్గొన్నారు.

ఖిల్లా రామాలయాన్ని సందర్శించిన అధికారులు

డిచ్‌పల్లి, నవంబర్ 4 : చారిత్రాత్మక నిలయమైన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయాన్ని టూరిజం అండ్ ఎండోమెంట్ అధికారులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి సోమవారం సందర్శించారు. బాసర సరస్వతీ మాత ఆలయానికి వెళ్లిన అధికారులు.. రూరల్ నియోజకవర్గంలోని మల్కాపూర్‌లో ఉన్న అనంతపద్మనాభస్వామి దేవాలయంతోపాటు డిచ్‌పల్లి ఖిల్లా రామాయాలన్ని సందర్శించారు. ప్రాజెక్టు రామడును అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

డీఈవోగా అశోక్‌కుమార్

అశోక్‌కుమార్

కంఠేశ్వర్, నవంబర్ 4 : నిజామాబాద్ జిల్లా విద్యాధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ఆసిఫాబాద్‌లో సీనియర్ లెక్చరర్‌గా పనిచేసిన అశోక్‌కుమార్‌ను నియమించింది. దుర్గాప్రసాద్‌ను మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేసింది.

పొతంగల్ ఆర్ఐ తీరుపై నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న పొతంగల్ గ్రామస్తులు

పొతంగల్, నవంబర్ 4 : పొతంగల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిలు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ మండల ప్రజలు స్థానిక బస్టాండ్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఆర్ఐ తన విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కల్యాణలక్ష్మి పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్నా.. సరైన కారణాలు చెప్పకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీసేవ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, ఈ విషయమై అడిగితే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్ఐని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తంగా..

- **ఆలయాలకు కార్తీక శోభ-** సుభాష్‌నగర్, నవంబర్ 4 : కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ శివాలయాలు కిటకిటలాడాయి. ఉదయం, సాయంత్రం ఆలయాల్లో మహిళలు దీపారాధనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. నగరంలోని నీలకంఠేశ్వరాలయం, శంభులింగేశ్వరాలయం, మార్కండేయ మందిరం, ఉమామహేశ్వరాలయం, మనోకామేశ్వరాలయంలతోపాటు ఇతర ఆలయాల్లో మహిళలు తులసి, ఉసిరిక పూజలు చేసి, దీపాలు వెలిగించారు.
- **ఏసీపీ ఆఫీస్ అటాచ్ నుంచి వన్‌టౌన్‌కు.. -** వినాయక్‌నగర్, నవంబర్ 4 : నిజామాబాద్ ఏసీపీ కార్యాలయంలో అటాచ్డ్‌గా ఉన్న ఎస్సై మొగులయ్యను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై-2గా బదిలీ చేస్తూ ఏసీపీ రాజావెంకటరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోటౌన్ ఎస్సై-2గా విధులు నిర్వర్తించిన మొగులయ్య.. తనను మరో పోలీస్‌స్టేషన్‌కు బదిలీచేయాలని అప్పటి సీపీ కల్మేశ్వర్‌కు రిక్వెస్ట్ పెట్టుకున్నారు. ఆయన మరోఠాణాలో పోస్టింగ్ ఇవ్వకుండా ఏసీపీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. మొగులయ్యను వన్‌టౌన్‌కు సోమవారం తాత్కాలికంగా బదిలీ చేశారు.
- **మార్కెట్ యార్డులో నూతన వ్యాపార లావాదేవీలు ప్రారంభం-** ఖలీల్‌వాడి, నవంబర్ 4 : జిల్లాకేంద్రంలోని మార్కెట్‌యార్డులో నూతన వ్యాపార లావాదేవీలను మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రాంచందర్, డైరెక్టర్లు మల్లేశ్, కౌడపు రఘువీర్, రాజలింగం పాల్గొన్నారు.
- **లయన్స్ సహారా ఆధ్వర్యంలో రక్తదానం -** ఖలీల్‌వాడి, నవంబర్ 4 : లయన్స్‌సహారా ఆధ్వర్యంలో నగరంలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో లయన్ నటరాజ్‌శేఖర్ పుట్టినరోజు సందర్భంగా క్లబ్ సభ్యులు సోమవారం రక్తదానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నర్సింహారావు, జిల్లా కార్యదర్శి ఉదయ సూర్యభగవాన్, కోశాధికారి ఎస్‌కే అహ్మద్, వి.నటరాజశేఖర్, వి.లక్ష్మీనారాయణగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.
- **కొనుగోలు కేంద్రం ప్రారంభం -** సారంగాపూర్, నవంబర్ 4 : మండలంలోని ముత్తకుంట పీఏసీఎస్ సొసైటీ పరిధిలోని గాంధీనగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ పైసా స్వామి, సీఈవో రాము, మాజీ సర్పంచ్ అనూషా లక్ష్మణ్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచులనూ మోసం చేసిన సర్కారు

కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మోర్తాడ్, నవంబర్ 4: అన్ని వర్గాల ప్రజలను, రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మాజీ సర్పంచులను కూడా మోసం చేసిందని బీఆర్ఎస్ కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ అన్నారు. కమ్మర్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి పదినెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. బిల్లులు అడిగేందుకు హైదరాబాద్ తరలి వస్తారనే ఉద్దేశంతో మాజీ సర్పంచులను అరెస్ట్ చేయడం అమానుషమని అన్నారు. సమావేశంలో రెంజర్ల మహేందర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి మోటారు వితరణ

మోర్తాడ్, నవంబర్ 4: మెండోరా మండలం పోచంపాడ్ వద్ద ఉన్న ఆశ్రమంలో కొన్ని సంవత్సరాలుగా నీటిసమస్య ఉండడంతో మోర్తాడ్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు రాజేశ్వర్ బోరు కోసం మోటార్‌ను వితరణ చేశారు. సోమవారం మోటారును బోరుకు బిగించి ప్రారంభించారు.

ఎన్యుమరేటర్లకు శిక్షణ

మోర్తాడ్/బాల్కొండ/మాక్లూర్/ఆర్మూర్‌టౌన్, నవంబర్ 4: కమ్మర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమగ్ర కుటుంబ సర్వేపై ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రాజశ్రీనివాస్ మాట్లాడుతూ..ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికీ వెళ్లి పకడ్బందీగా సర్వేను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆంధ్రయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీటీచర్లు పాల్గొన్నారు. బాల్కొండలోని జడ్పీహెచ్ఎస్‌లో మాస్టర్ ట్రైనీ నర్సయ్య, నటరాజ్ ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. మండల ప్రత్యేకాధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, ఎంఎస్‌వో పాల్గొన్నారు. మాక్లూర్ రైతు వేదికలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ శేఖర్ మాట్లాడారు. ఎంపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చారు.

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

రెంజల్, నవంబర్4:రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఏపీఎం చిన్నయ్య సూచించారు. బాగేపల్లి, దండిగుట్ట గ్రామాల్లో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సాయిలు, సురేందర్‌గౌడ్, సాయిబాబాగౌడ్, సీసీలు భాస్కర్, శివ, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో గంగస్నానం చేయాలి

నవీపేట, నవంబర్ 4: కార్తిక మాసంలో గోదావరి నదిలో ప్రజలు పుణ్య స్నానాలు ఆచరిస్తే పాప విముక్తి కల్గుతుందని రాజయోగి మహరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని లింగం గుట్ట సిద్ధాశ్రమంలో సోమవారం అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు బొట్టు పెట్టి ఆశీర్వదించారు. భక్తులకు అన్నదానం చేశారు.

మాజీ సర్పంచుల అక్రమ అరెస్ట్

మోర్తాడ్‌లో పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులతో ఎస్సై

జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ..

నమస్తేతెలంగాణ యంత్రాంగం, నవంబర్ 4: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలని శాంతియుత నిరసన కార్యక్రమానికి తరలుతారని తెలిసి పోలీసులు జిల్లాలోని పలు మండలాల మాజీ సర్పంచులను సోమవారం తెల్లవారుజామున అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డిచ్‌పల్లి మండలంలోని 12 గ్రామాల సర్పంచులను తెల్లవారుజామున 4.30 గంటల నుంచే అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శక్కరికొండ కృష్ణ, నల్లవెల్లి సాయిలు అన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో బీఆర్ఎస్ మాజీ సర్పంచులు నీరడి పద్మారావు, గుడాల లింగం, పత్తి ఆనంద్, సర్దార్ నాయక్, యూసుఫ్, నల్లవెల్లి నర్సయ్య, పాపాయి తిరుపతి, మోజీరాం తదితరులు ఉన్నారు. జక్రాన్‌పల్లిలో బీఆర్ఎస్ జక్రాన్‌పల్లి మండల అధ్యక్షుడు నట్ట భోజన్న, రైతుబంధు సమితి మండల మాజీ కన్వీనర్ ఢీకొండ శ్రీనివాస్‌తోపాటు బ్రాహ్మణ్‌పల్లి, పడకల్ మాజీ సర్పంచులు మాదరి దేవరాజ్, పుప్పాల శ్రీనివాస్, మండల కో-ఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌ఖాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇందల్వాయి మండలంలోని టోల్‌ప్లాజా వద్ద సర్పంచుల ఫోరం ప్రధానకార్యదర్శి విజయ్‌కుమార్‌తోపాటు మాజీ సర్పంచులను పోలీసులు అరెస్టు చేశారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ముప్కాల్, బాల్కొండ, భీమ్‌గల్, ఏర్గట్ల, బోధన్, ఆర్మూర్, వేల్పూర్, నవీపేట తదితర మండలాల్లో మాజీ సర్పంచులను తెల్లవారుజామున అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మోర్తాడ్ మండల మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బోగ ఆనంద్, ఉప్లూర్ చిన్నారెడ్డి, గడ్డం స్వామి మాట్లాడారు. తమకు రావాల్సిన బిల్లులు అడిగితే పోలీసులతో అరెస్ట్ చేయించడం విడ్డూరమన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు బస్సు ప్రారంభం

పూజలు చేసి బస్సును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ శ్రీనివాస్

బోధన్, నవంబర్ 4: బోధన్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు సూప